కలం
kalamdaily.com
Follow on: Kalamtelugu
సోమవారం
30-03-2026
పేజీలు: 5
ప్రజల గళం...

360° SINGLE TOPIC
ఆపరేషన్ కగార్

మావోయిస్టు పార్టీ అంతమైనట్టేనా..?
ఉద్యమం ఉనికిని కోల్పోయినట్టేనా..? సాయుధ పోరాటానికి కాలం చెల్లినట్టేనా..?
ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో మనుగడ ప్రశ్నార్థకమేనా..?
ఇకపై అదంతా ముగిసిన అధ్యాయమేనా..? భవిష్యత్ తరాలకు చరిత్ర మాత్రమేనా..?
ఇలాంటి ఎన్నో రకాల ప్రశ్నలు.. సమాధానాలు మాత్రం వేర్వేరు.

కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న మొదలుపెట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టు ఉద్యమం కుదేలైంది. వరుస ఎన్‌కౌంటర్లు, సరెండర్లతో లీడర్లు, కేడర్ లేని పార్టీగా మిగిలిపోయింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా దేశ అంతర్గత భద్రతకే సవాలుగా నిలిచి, దండకారణ్యంలో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టు పార్టీ 'గతం' ఎలా ఉన్నా వర్తమానం, భవిష్యత్తు మాత్రం గందరగోళం. ఆపరేషన్ కగార్ ముగింపుపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చేయబోయే ప్రకటన ఏమిటనేది ఇప్పుడు కీలకం.

నక్సల్బరీలో మొదలై శ్రీకాకుళం మీదుగా తెలంగాణకు చేరి 12 రాష్ట్రాలకు విస్తరించిన పీపుల్స్ వార్, మావోయిస్టు పార్టీపై కలం 360 డిగ్రీస్ స్పెషల్..

తెలంగాణ బ్యూరో, కలం

# రెడ్ కారిడార్‌కు రెడ్ సిగ్నల్!

## మావోయిస్టు ఉద్యమం.. ముగిసిన శకం!

### 'ఆపరేషన్ కగార్'తో పార్టీ కకావికలం

### వరుస ఎన్‌కౌంటర్లు, సరెండర్లతో బలహీనం

### 60 ఏండ్ల ప్రస్థానం.. రెండేండ్లలో పతనం



## ఆ ఒక్కడి చుట్టూ సస్పెన్స్..


**గణపతి** అలియాస్ ముప్పాళ్ల లక్ష్మణ్ రావు.. మావోయిస్టు పార్టీకి కేరాఫ్ అడ్రస్. నాటి పీపుల్స్ వార్ నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు దాదాపు 25 ఏండ్ల పాటు ప్రధాన కార్యదర్శి. జగిత్యాల జైత్రయాత్రకు ఏడాది ముందు (1977లో) పీపుల్స్ వార్‌లో ఆయన అజ్ఞాత జీవితం ప్రారంభం. కింది స్థాయి నుంచి పార్టీ పొలిట్‌బ్యూరో వరకు క్రియాశీలక పాత్ర. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర కమిటీ కార్యదర్శిగా పార్టీ నిర్మాణం, విధాన నిర్ణయాల్లో సుదీర్ఘ అనుభవం. పార్టీలో 1991లో తలెత్తిన సంక్షోభంలో అప్పటి ప్రధాన కార్యదర్శి, పీపుల్స్ వార్ వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్యతో సైద్ధాంతికంగానే విభేదాలు. 1994లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక. పశ్చిమబెంగాల్‌కు చెందిన 'పార్టీ యూనిటీ', బిహార్‌కు చెందిన 'మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్' విలీనమై మావోయిస్టు పార్టీగా మారడంలో యాక్టివ్ రోల్. జనతన సర్కార్, పీఎల్‌జీఏ నిర్మాణం, బెటాలియన్లు-ప్లాటూన్ల వ్యవస్థల వెనక బ్రెయిన్ చైల్డ్. అనేక దేశాల ఎం-ఎల్ పార్టీలతో సంబంధాలు, సమన్వయం, సహకారంలో దూరదృష్టి. చదివింది ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో బీఎస్సీ, బీఈడీ అయినా మొత్తం ప్రపంచాన్నే అధ్యయనం చేసిన మార్క్సిస్టు మేధావి. దాదాపు ఐదు దశాబ్దాల అజ్ఞాత జీవితం. అలాంటి నాయకుడు ఇప్పుడు ఎక్కడున్నారనేది వీడని సస్పెన్స్.

'తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు గణపతితో టచ్‌లో ఉన్నారు.. నేపాల్ నుంచి ఢిల్లీ చేరుకున్నారు.. అనారోగ్యానికి ఆయన మెడికల్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నారు.. ఢిల్లీలోనే అమిత్ షా సమక్షంలో లొంగిపోతారు..' ఇలాంటి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఆపరేషన్ కగార్ ముగింపు స్టేజ్‌లో గణపతి వ్యవహారం కీలకంగా మారింది. లొంగిపోతారా?.. అరెస్టవుతారా?.. మిస్సింగ్‌గా మిగిలిపోతారా?.. తేలాల్సి ఉంది.



నేపాల్ మొదలు కన్యాకుమారి వరకు రెడ్ కారిడార్ నిర్మించాలన్న మావోయిస్టు పార్టీ లక్ష్యానికి ఆపరేషన్ కగార్ బ్రేక్ వేసింది. విముక్తి ప్రాంతాలు, స్థావర ప్రాంతాలంటూ ఆ పార్టీ చెప్పుకున్నవన్నీ.. ఇప్పుడు పోలీసు క్యాంపులతో నిండిపోయాయి. తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, చత్తీస్‌గఢ్, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, కేరళ.. ఇలా 12 రాష్ట్రాల్లో మావోయిస్టు పార్టీ సాయుధ దళాలను నిర్మించింది. ప్రభుత్వ బలగాలకు దీటుగా బెటాలియన్లు, కంపెనీలు, ప్లాటూన్లు, మిలటరీ కమిషన్‌ను ఏర్పాటు చేసుకుంది. జనతన సర్కార్ పేరుతో ప్రత్యేక వ్యవస్థనే నెలకొల్పింది. గతంలో గ్రీన్ హంట్, సల్వాజుడుం, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్.. ఇలాంటివి ఎన్ని వచ్చినా తట్టుకుని నిలబడిన మావోయిస్టు పార్టీ ఇప్పుడు ఆపరేషన్ కగార్‌తో కుప్పకూలిపోయింది. పునాదులే కదిలిపోయాయి.






నంబాల కేశవరావు

## ఆరు దశాబ్దాల నిర్మాణం.. రెండేండ్లలో పతనం

పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీలో, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళంలో, ఉత్తర తెలంగాణలో భూస్వాములు, జాగీర్దార్ల పెత్తనానికి వ్యతిరేకంగా, వాళ్ల చేతుల్లోని భూములను పేదలకు పంచిపెట్టే నినాదంతో వామపక్ష భావజాలం ఉద్యమ రూపాన్ని తీసుకున్నది. తెలంగాణలో పీపుల్స్ వార్ పేరుతో 1970వ దశకంలో ఉనికిలోకి వచ్చి భావసారూప్యత కలిగిన పార్టీల విలీనంతో మావోయిస్టు పార్టీగా అవతరించింది. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం, వర్గశత్రు నిర్మూలన, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం, నూతన ప్రజాస్వామిక విప్లవం.. అనే పంథాలతో సాయుధ దళాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రహస్య పార్టీ నిర్మాణంతో ప్రభుత్వాలనే సవాలు చేసింది. పట్టణ, గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో కమిటీలను ఏర్పాటు చేసింది. చివరకు ఆపరేషన్ కగార్‌తో ఆ వ్యవస్థ మొత్తం రెండేండ్లలోనే పతనమైంది.

## సరెండర్లు, సైద్ధాంతిక విభేదాలతో కేడర్ డీమోరల్


కేంద్ర ప్రభుత్వం ఇన్‌ఫార్మర్, కోవర్ట్ మెకానిజంతో పాటు పార్టీలోనే సైద్ధాంతిక విభేదాల రూపంలో సంక్షోభాన్ని సృష్టించే ఎత్తుగడను అమలు చేసింది. మావోయిస్టు పార్టీ విముక్తి ప్రాంతంగా చెప్పుకునే అబూజ్‌మడ్‌లో 300కు పైగా సాయుధ పోలీసు క్యాంపులతో సైకలాజికల్ వార్ మొదలుపెట్టింది. మరోవైపు సాయుధ పోరాటం ఇప్పటి పరిస్థితుల్లో వర్తించదనే సైద్ధాంతిక పోరాటాన్ని వాడుకున్నది. కండ్ల ముందే అగ్రనేతలు చనిపోవడం, లొంగిపోవడంతో కిందిస్థాయి నేతల్లో అలజడి మొదలైంది. ఆ ప్రభావం పీఎల్‌జీఏ, మిలీషియా దళాల వరకు కన్ఫ్యూజన్‌ను క్రియేట్ చేసింది. అడవిలో కదలికలకు పరిమితులు ఏర్పడ్డాయి. సెల్ఫ్ డిఫెన్స్ కోసం సేఫ్ జోన్ల వైపు మావోయిస్టు లీడర్లు, కేడర్ వెళ్లాల్సిన పరిస్థితుల్లో చెట్టుకొకరు పుట్టకొకరుగా విడిపోయి వీక్ అయ్యారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోవడమో లేక లొంగిపోవడమో.. అనే డెసిషన్ తీసుకోక తప్పలేదు.

## ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్‌తో స్టార్ట్

మావోయిస్టు పార్టీ చరిత్రలోనే మొట్టమొదటిసారి ప్రధాన కార్యదర్శి(నంబాల కేశవరావు) ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అది ఆపరేషన్ కగార్‌లో కేంద్ర ప్రభుత్వం సాధించిన మొదటి విజయంగా నమోదైంది. అప్పటి నుంచి స్పీడప్ అయిన వేట పదుల సంఖ్యలో కేంద్ర, రాష్ట్ర, స్పెషల్ జోనల్ కమిటీల నాయకత్వాన్ని నిర్మూలించింది. అటు ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో.. ఇటు పోలీసులకు లొంగిపోవడమో.. మినహా మరో మార్గం లేని పరిస్థితుల్ని సృష్టించింది. పాతికమందికి పైగా ఉండే కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో కమిటీలు ఇప్పుడు ముగ్గురికే పరిమితమయ్యాయి. బెటాలియన్లు, కంపెనీలు, ప్లాటూన్లు, మిలిటరీ కమిషన్లు, సాయుధ దళాల ఉనికి ప్రశ్నార్థకమైంది. ఒకవైపు కూంబింగ్‌లు, మరోవైపు ఫైరింగ్‌లతో మావోయిస్టు పార్టీ నిర్మాణం కుదేలైంది. లీడర్లు, కేడర్ మధ్య సమన్వయం సంగతేమో గానీ కమ్యూనికేషనే లేని గడ్డు పరిస్థితులు నెలకొన్నాయి.

## హింస, త్యాగాలతో భయం.. భయం..

1980వ దశకం మొదలు 2004లో శాంతి చర్చల వరకు పల్లెల్లో పగలు పోలీసులు.. రాత్రి అన్నలు.. అనే మాటలు వినిపించేవి. నిత్యం తుపాకీ కాల్పులు, ఇనుప బూట్ల చప్పుళ్లే. రోజూ ఎన్‌కౌంటర్, ఆంబుష్‌లు, ప్రజాకోర్టుల్లో శిక్షలు, కూంబింగ్ ఆపరేషన్లకు సంబంధించిన వార్తలే. ఎప్పుడేం జరుగుతుందో తెలియని భయం. పదుల సంఖ్యలో రాజకీయ నేతలను మావోయిస్టులు చంపేశారు. వందలాది మంది పోలీసులు ల్యాండ్‌మైన్స్ ఘటనల్లో చనిపోయారు. ఆదివాసీలు, గిరిజనులు, సామాన్యులు మావోయిస్టు పార్టీ సభ్యులు వేలాది మంది ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. అటు మావోయిస్టులు, ఇటు పోలీసుల్లో ప్రాణత్యాగాలు తప్పలేదు. ఇదంతా గతం.. ఇప్పుడు మావోయిస్టు పార్టీ బలహీనమైంది.. ఉద్యమం లేదు.. నేతలు, శ్రేణులూ లేరు.. 60 ఏండ్ల త్యాగాలు ఏం సాధించాయన్నది ఓ డిబేట్. ఇప్పుడు ప్రజల, ప్రభుత్వాల ఫోకస్ అంతా భవిష్యత్తుపైనే.



## నాయకత్వమే టార్గెట్‌గా ముప్పేట దాడి

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను కేవలం ఒక సైనిక చర్యగానే పరిగణించలేదు. వివిధ రూపాల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వాన్నే నిర్మూలించాలని భావించింది. ఏక కాలంలో బహుళ వ్యూహాలతో, పకడ్బందీ సమన్వయంతో నిర్దిష్ట డెడ్‌లైన్ పెట్టుకుని కార్యాచరణ కొనసాగించింది. మావోయిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంగా ప్రజల్లో భావజాలాన్ని వ్యాప్తి చేయడం, ప్రభుత్వ పథకాల ఫలాలను మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లడం.. లాంటి విధానాలను అవలంబించింది. ఏరియల్ బాంబింగ్, డ్రోన్ నిఘా, కదలికలను పసిగట్టడం, శాటిలైట్ మ్యాపింగ్‌తో గుర్తించడం, ఇమేజ్‌లను రియల్ టైమ్‌లో పోలీసు బలగాలకు చేరవేసే మెకానిజాన్ని రూపొందించడం, కమ్యూనికేషన్ ఇంటర్‌సెప్షన్ టెక్నాలజీ వినియోగం, కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సెంట్రలైజ్డ్ డైరెక్షన్స్ ఇవ్వడం.. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం విజయం సాధించేందుకు దోహదపడ్డాయి.



# ఆపరేషన్ కగార్ ఎన్‌కౌంటర్లు

## డెడ్ లైన్ మార్చి 31

'మావోయిస్టు ముక్త్ భారత్' నినాదంతో కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న 'ఆపరేషన్ కగార్' అధికారికంగా ప్రారంభించింది. చత్తీస్‌గఢ్‌లోని బస్తర్, దండకారణ్యం, అబూజ్‌మఢ్ అడవులు, తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన కర్రెగుట్ట, రంపచోడవరం, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని 'రెడ్ కారిడార్' ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ మొదలుపెట్టింది. లక్ష మందికిపైగా భద్రతా బలగాలు ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకుంటున్నాయి. వీరిలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), ఎలైట్ కోబ్రా యూనిట్లు, డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్ (డీఆర్‌జీ), స్టేట్ పోలీసులు ఉన్నారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, సరిహద్దు భద్రతా బలగాలైన బీఎస్ఎఫ్, ఐటీబీపీ ఆపరేషన్ కగార్‌కు తమ వంతు సహకారం అందిస్తున్నాయి. 2026 మార్చి 31 నాటికి ఇండియాను 'నక్సల్స్ రహిత దేశం'గా మార్చాలనేది కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లక్ష్యం.

ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత 2024లో సుమారు 320 మంది, 2025లో దాదాపు 410 మంది, 2026 మార్చి 29 వరకు సుమారు 83 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. 2024లో బస్తర్, కాంకేర్, బీజాపూర్, దంతేవాడ, గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. 2025లో అబూజ్‌మఢ్, కర్రెగుట్టలు (చత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు), గరియాబంద్ (ఒడిశా బార్డర్)లో, 2026లో బీజాపూర్, సుక్మా, నారాయణపూర్‌లో ఎక్కువ ఎన్‌కౌంటర్లు చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు వందకు పైగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. దేశవ్యాప్తంగా దాదాపు 825 మంది చనిపోయారు.


- 90 శాతం ఎన్‌కౌంటర్లు చత్తీస్‌గఢ్‌లోనే జరిగాయి. 2024–25లో ఒక్క చత్తీస్‌గఢ్ స్టేట్‌లోనే సుమారు 532 మంది మావోయిస్టులు చనిపోయారని ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి విజయ్ శర్మ ప్రకటించారు.
- తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు ప్రధానంగా చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో ఆపరేషన్లు నిర్వహించాయి. 2024లో తెలంగాణ సరిహద్దుల్లో సుమారు 15 మంది మరణించారు. 2025లో మరణాలు లేనప్పటికీ, పెద్ద సంఖ్యలో (సుమారు 486 మంది) లొంగిపోయారు.
- మహారాష్ట్రలోని గడ్చిరోలి, ఒడిశాలోని కలహండి, మల్కనగిరి జిల్లాల్లో సంయుక్త ఆపరేషన్లతో 2024-25లో సుమారు 40 మంది మావోయిస్టులు చనిపోయారు.



## కీలక సెంట్రల్ కమిటీ సభ్యులు మృతి

ఆపరేషన్ కగార్ ప్రారంభమైనప్పటి నుంచి మావోయిస్టు పార్టీకి చెందిన పలువురు సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. మృతుల్లో నంబాల కేశవరావు, చలపతి, తెంటు లక్ష్మీనరసింహచలం, గాజర్ల రవి, హిడ్మా, రాజు దాదా, కోస దాదా వంటి కీలక సభ్యులు ఉన్నారు.

### నంబాల కేశవరావు



**అలియాస్ బసవరాజు**
**స్వస్థలం:** ఏపీలోని శ్రీకాకుళం జిల్లా
**స్థాయి:** జనరల్ సెక్రటరీ (టాప్ సీసీ)
**రివార్డు:** రూ.కోటికి పైన
**చనిపోయిన తేదీ, స్థలం:** 21 మే 2025, అబూజ్‌మఢ్ అడవులు, చత్తీస్‌గఢ్

### చలపతి



**అలియాస్ ప్రతాప్ రెడ్డి రామచంద్రారెడ్డి**
**స్వస్థలం:** ఏపీలోని చిత్తూరు జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు
**రివార్డు:** రూ.35 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** జనవరి 2025, చత్తీస్‌గఢ్

### తెంటు లక్ష్మీనరసింహచలం



**అలియాస్ సుధాకర్**
**స్వస్థలం:** ఏపీలోని ఏలూరు జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు
**రివార్డు:** రూ.20 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** జూన్ 5, 2025 ఇంద్రావతి నేషనల్ పార్క్, చత్తీస్‌గఢ్

### గాజర్ల రవి



**అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్**
**స్వస్థలం:** తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు
**రివార్డు:** రూ.25 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** జూన్ 17, 2025 ఆంధ్రప్రదేశ్ అడవులు.

### మాడవి హిడ్మా




**స్వస్థలం:** చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా
**స్థాయి:** కేంద్ర కమిటీ సభ్యుడు, బెటాలియన్ నంబర్ 1 కమాండెంట్
**రివార్డు:** రూ.1.80 కోట్లు
**చనిపోయిన తేదీ, స్థలం:** 2025 నవంబర్ 18, ఏపీ

### గుమ్మడవెల్లి రేణుక



**అలియాస్ మిడ్కో**
**స్వస్థలం:** తెలంగాణలోని జనగామ జిల్లా
**స్థాయి:** దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు, **రివార్డు:** రూ.45 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** 2025 మార్చి 31, మహారాష్ట్ర–చత్తీస్‌గఢ్ సరిహద్దు

### పడకల స్వామి



**అలియాస్ ప్రభాకర్**
**స్వస్థలం:** తెలంగాణ, కామారెడ్డి జిల్లా.
**స్థాయి:** వెస్ట్ బస్తర్ సబ్ జోనల్ బ్యూరో, గడ్చిరోలి డివిజన్ కమిటీ సభ్యుడు,
**రివార్డు:** రూ.50 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** ఫిబ్రవరి 6, 2026. గడ్చిరోలిలోని అబూజ్‌మడ్

### పతిరామ్ మాంఝీ



**అలియాస్ అనల్ దా అలియాస్ అజిత్**
**స్వస్థలం:** జార్ఖండ్, గిరిడిహ్ జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు, జార్ఖండ్–ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీ, **రివార్డు:** రూ.1.25 కోట్లు.
**చనిపోయిన తేదీ, స్థలం:** 2026 జనవరి 22 జార్ఖండ్‌లోని సింఘ్‌భూమ్ జిల్లా సారండా అడవులు..

### అరుణ



**స్వస్థలం:** ఏపీలోని శ్రీకాకుళం జిల్లా
**స్థాయి:** స్టేట్ కమిటీ మెంబర్
**రివార్డు:** రూ.15 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** జూన్ 17, 2025 ఆంధ్రప్రదేశ్ అడవులు

### రాజుదాదా



**అలియాస్ కాటా రామచంద్రారెడ్డి**
**స్వస్థలం:** తెలంగాణలోని కరీంనగర్ జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు, దండకారణ్య అధికార ప్రతినిధి
**రివార్డు:** రూ.40 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** సెప్టెంబర్ 2025, చత్తీస్‌గఢ్

### కోస దాదా



**అలియాస్ కడారి సత్యనారాయణరెడ్డి**
**స్వస్థలం:** తెలంగాణలోని సిరిసిల్ల జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు
**రివార్డు:** రూ.40 లక్షలు
**చనిపోయిన తేదీ, స్థలం:** సెప్టెంబర్, 2025 అబూజ్‌మడ్ అడవులు, చత్తీస్‌గఢ్

### మోడెం బాలకృష్ణ



**అలియాస్ మనోజ్**
**స్వస్థలం:** తెలంగాణలోని హనుమకొండ జిల్లా
**స్థాయి:** సెంట్రల్ కమిటీ సభ్యుడు
**రివార్డు:** రూ.కోటి
**చనిపోయిన తేదీ, స్థలం:** సెప్టెంబర్ 12, 2025 గరియాబాండ్ జిల్లా, చత్తీస్‌గఢ్

# ఆపరేషన్ కగార్.. సరెండర్లు

2024లో ప్రారంభమైన 'ఆపరేషన్ కగార్'లో ఇప్పటివరకు దాదాపు 3,600 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో దేవ్ జీ, మల్లోజుల వేణుగోపాల్, సంగ్రామ్, చంద్రన్న, దామోదర్, పాపారావు వంటి కీలక నేతలతోపాటు వివిధ స్థాయిలోని మావోయిస్టులు ఉన్నారు. 1,500 నుంచి 2వేల మంది వరకు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

## చత్తీస్‌గఢ్‌లోనే ఎక్కువ

1200 మంది వరకు మావోయిస్టులు లొంగిపోగా.. వారిలో ఎక్కువ మంది చత్తీస్‌గఢ్ లోనే లొంగిపోయినట్లు లెక్కలు చెప్తున్నాయి. దాదాపు వెయ్యి మందికిపైగా ఈ రాష్ట్రంలో సరెండర్ అయ్యారు. 2025 అక్టోబర్ 17న దాదాపు 200 మంది మావోయిస్టులు చత్తీస్‌గఢ్ పోలీసు అధికారుల సమక్షంలో లొంగిపోయారు. ఇది చారిత్రాత్మక ఘట్టం అంటూ ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయ్ అప్పట్లో ప్రకటించారు. మహారాష్ట్రలో దాదాపు వంద మందికిపైగా లొంగిపోయారు. ఆ రాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షంలో మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ వంటి కీలక నేతలు సరెండర్ అయ్యారు. ఒడిశాలో 90, తెలంగాణలో 721, ఏపీలో 35 మంది వరకు లొంగిపోయారు. తెలంగాణలో డీజీపీ సమక్షంలో లొంగిపోయినవాళ్లలో దేవ్ జీ, సంగ్రామ్, దామోదర్ వంటి వారు ఉన్నారు.

## మిగిలిందెవరు?


మిసిర్ బెస్రా


పసునూరి నరహరి

మావోయిస్టు పార్టీలో అగ్రనేతలంతా ఆపరేషన్ కగార్ సందర్భంగా ఎన్‌కౌంటర్లలో చనిపోవడమో.. లేక పోలీసులకు లొంగిపోవడమో.. జరుగుతున్న తరుణంలో మరికొందరు నేతల ఆచూకీ సస్పెన్స్‌గా మిగిలిపోయింది. జార్ఖండ్‌కు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు (పొలిట్‌బ్యూరో సభ్యుడు కూడా) మిసిర్ బెస్రా (భాస్కర్, నిర్భయ్, సాగర్), కేంద్ర కమిటీ సభ్యుడు పసునూరి నరహరి (టెక్ విశ్వనాథ్, సంతోష్) .. వీరంతా ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నట్లు తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు తెలిపారు. వీరు కాక కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో నలుగురు డివిజనల్ కమిటీ లీడర్లు కూడా సరెండర్ కాకుండా అజ్ఞాతంలోనే ఉన్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీ కీలక నేత గణపతి ఇష్యూపై సస్పెన్షన్ కొనసాగుతూనే ఉంది.

## 35 మంది పోలీసులు మృతి

ఆపరేషన్ కగార్‌లో ఇప్పటి వరకు పోలీసులు 35 మంది వరకు చనిపోయారు. 2024లో 19 మంది, 2025లో 12 మంది, 2026లో నలుగురు చనిపోయారు. చత్తీస్‌గఢ్‌లో 31 మంది, ఒడిశాలో ఇద్దరు, తెలంగాణ, మహారాష్ట్రలో ఒక్కొక్కరు మృతి చెందారు. మావోయిస్టులు అమర్చిన ల్యాండ్ మైన్లు పేలడంతోనే వీరు చనిపోయారు. 2025 జనవరిలో బీజాపూర్‌లో జరిగిన పేలుడులో 8 మంది చనిపోయారు. 2025లో కర్రెగుట్టల్లో జరిగిన ఆపరేషన్‌లోనే 18 మంది సిబ్బంది గాయపడ్డారు.



### పాపారావు

అలియాస్ సున్నం చంద్రయ్య అలియాస్ మంగు దాదా. దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కమాండర్. 2026 మార్చి 25న చత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం విజయ్ శర్మ ఎదుట లొంగుబాటు.
**స్వస్థలం:** చత్తీస్‌గఢ్ సుక్మా జిల్లా
**అజ్ఞాతం:** 25 ఏండ్లు, **రివార్డు:** 25 లక్షలు

### ఆశన్న



అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవరావు. సెంట్రల్ కమిటీ మెంబర్. 2025 అక్టోబర్‌లో చత్తీస్‌గఢ్ పోలీసుల ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** ములుగు జిల్లా వెంకటాపురం మండలం,
**అజ్ఞాతం:** 36 ఏండ్లు, **రివార్డు:** రూ. కోటి

### దేవ్ జీ



అలియాస్ తిప్పిరి తిరుపతి. పొలిట్ బ్యూరో సభ్యుడు. 2026 ఫిబ్రవరిలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** జగిత్యాల జిల్లా కోరుట్ల
**అజ్ఞాతం:** 35 ఏండ్లు, **రివార్డు:** 40 లక్షలు

### దామోదర్



అలియాస్ బడే చొక్కారావు. తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి. 2026 ఫిబ్రవరిలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి., **అజ్ఞాతం:** 30 ఏండ్లు

### సంగ్రామ్



అలియాస్ మల్లా రాజిరెడ్డి. సెంట్రల్ కమిటీ సభ్యుడు. 2026 ఫిబ్రవరిలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** పెద్దపల్లి జిల్లా శాస్త్రులపల్లి.
**అజ్ఞాతం:** 45 ఏండ్లు, **రివార్డు:** రూ. 40 లక్షలు

### బర్సె దేవా



ఫస్ట్ కంపెనీ కమాండెంట్. 2026 జనవరిలో తెలంగాణ పోలీసుల ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** చత్తీస్ గఢ్
**అజ్ఞాతం:** 25 ఏండ్లు,
**రివార్డు:** రూ. 75 లక్షలు

### గంగన్న



అలియాస్ నూనె నర్సింహారెడ్డి. స్పెషల్ జోన్ కమిటీ సెక్రటరీ. 2026 ఫిబ్రవరిలో తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగుబాటు.
**స్వస్థలం:** ఏపీలోని గుంటూరు
**అజ్ఞాతం:** 30 ఏండ్లు,
**రివార్డు:** రూ. 20 లక్షలు

### మల్లోజుల వేణుగోపాల్



అలియాస్ అభయ్ అలియాస్ సోను. పొలిట్ బ్యూరో సభ్యుడు. 2025 అక్టోబర్ లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ముందు లొంగుబాటు.
**స్వస్థలం:** పెద్దపల్లి, **అజ్ఞాతం:** 44 ఏండ్లు
**రివార్డు:** రూ. 6 కోట్లు

### తారక్క



మల్లోజు వేణుగోపాల్ భార్య. స్పెషల్ జోన్ కమిటీ సెక్రటరీ. 2025 జనవరిలో మహారాష్ట్ర పోలీసుల ఎదుట లొంగుబాటు.
**స్వస్థలం:** మహారాష్ట్ర
**అజ్ఞాతం:** 38 ఏండ్లు, **రివార్డు:** రూ. 2 కోట్లు

### సుజాతక్క



అలియాస్ మైనక్క. సెంట్రల్ కమిటీ మెంబర్. కిషన్ జీ భార్య. 2025 సెప్టెంబర్ లో తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాటు.
**స్వస్థలం:** గద్వాల జిల్లా
**అజ్ఞాతం:** 40 ఏండ్లు, **రివార్డు:** రూ. 1 కోటి


### చంద్రన్న



అలియాస్ పుల్లూరి ప్రసాదరావు. సెంట్రల్ కమిటీ మెంబర్. 2025 అక్టోబర్ లో తెలంగాణ పోలీసుల ఎదుట లొంగుబాటు.
**స్వస్థలం:** పెద్దపల్లి జిల్లా
**అజ్ఞాతం:** 45 ఏండ్లు, **రివార్డు:** రూ. 25 లక్షలు

## మూడు మంత్రదండాలతో తెలంగాణ స్ట్రాటజీ

మావోయిస్టు పార్టీ నిర్మూలన కోసం ఇతర రాష్ట్రాల్లో కూంబింగ్‌లు, ఎన్‌కౌంటర్లు జరుగుతూ ఉంటే తెలంగాణలో మాత్రం సరెండర్ స్ట్రాటజీ అమలవుతున్నది. స్టేట్ ఇంటెలిజెన్స్ వినూత్న వ్యూహంతో లొంగుబాటు మార్గమే ఉత్తమమనే అభిప్రాయానికి వచ్చింది. సైకలాజికల్ వార్‌పై ఫోకస్ పెట్టింది. ఇందుకు సోషల్, లాజికల్ రీజన్‌ను అన్వేషించింది. "మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోతే 'అమరులు' అవుతారు. అరెస్టు అయితే ప్రజల్లో 'హీరో' అవుతారు. లొంగిపోతే ప్రజల్లో 'చులకన' అవుతారు"... ఇదీ తెలంగాణ ఎస్ఐబీ ఎంచుకున్న వ్యూహం. అరెస్టయిన తర్వాత బెయిల్‌పై రిలీజ్ అయితే మళ్లీ మావోయిస్టు బాటలోకి వెళ్తారనేది పోలీసులకు తెలియంది కాదు. అందుకే సరెండర్ చేయిస్తే తిరిగి ఉద్యమంలోకి వెళ్ళలేరని భావించింది. దీనికి తోడు మావోయిస్టుల కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చి 'సరెండర్ అప్పీల్' చేయించింది.



మావోయిస్టు నేతలు తిప్పిరి తిరుపతి (దేవ్ జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), పుల్లూరి ప్రసాద్ (చంద్రన్న), బడే చొక్కారావు (దామోదర్), నూనె నర్సింహారెడ్డి (గంగన్న) ప్రభుత్వానికి లొంగిపోయిన అనంతరం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని 2026 ఫిబ్రవరి 27న కలిసినప్పటి దృశ్యం.

## ఎన్నో ఆటుపోట్లు.. త్యాగాల పరంపర..

పీపుల్స్ వార్‌గా ఉన్నప్పుడుగానీ, ఆ తర్వాత మావోయిస్టు పార్టీగా అవతరించిన తర్వాతా ఆ పార్టీ కార్యకలాపాలన్నీ రహస్యమే. నాయకత్వం మొదలు కేడర్ వరకు అందరిదీ అజ్ఞాత జీవితమే. ఫస్ట్ టైమ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి పీపుల్స్ వార్‌పైనా, ఆరు అనుబంధ సంఘాలపైనా అధికారికంగా నిషేధం విధించిన తర్వాత వాటిపై ప్రభుత్వ నిర్బంధం పెరిగింది. దాని వెన్నంటే పీపుల్స్ వార్ కార్యకలాపాలు మరింత రహస్యమయ్యాయి. పీపుల్స్ వార్ క్యాడర్‌ను, దళాలను పట్టుకోడానికి పోలీసులు అప్పట్లోనే ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ తర్వాత అది కోవర్ట్ ఆపరేషన్‌ల స్థాయికి చేరుకున్నది. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న మావోయిస్టు పార్టీ వేలాది మందిని కోల్పోయింది. అయినా దశాబ్దాలుగా నిలదొక్కుకున్నది.



2026 మార్చి 7న సీఎం రేవంత్ రెడ్డి ఎదుట 130 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు 124 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు.

## టెక్నాలజీతో మావోయిస్టు పార్టీ కుదేలు

గెరిల్లా యుద్ధతంత్రంతో పోలీసులతో ఢీకొట్టగలిగిన మావోయిస్టు పార్టీ టెక్నాలజీ చేతిలో మాత్రం బందీ అయింది. సౌకర్యం కోసం వాడిన కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆ పార్టీని చక్రబంధంలో బిగించింది. మావోయిస్టులు వాడుతున్న సెల్‌ఫోన్లు, వాకీటాకీల సిగ్నళ్ళపై పోలీసుల నిఘా పెరిగింది. శాటిలైట్ నిఘా ముమ్మరమైంది. మావోయిస్టుల నిర్దిష్టమైన లొకేషన్‌ను పసిగట్టడం సులువైంది. ఈ సమాచారాన్ని ఫీల్డులోని భద్రతా బలగాలకు ఎప్పటికప్పుడు అందించేలా కేంద్రీకృత కమాండ్ వ్యవస్థ పకడ్బందీగా అమలైంది. ఫలితంగా కూంబింగ్ చర్యలతో మావోయిస్టు దళాల కదలికలు పరిమితమయ్యాయి. అదే సమయంలో మావోయిస్టులకు ఫుడ్, మెడిసిన్ 'సప్లై చెయిన్' సిస్టమ్‌ను భద్రతా బలగాలు దెబ్బకొట్టాయి. భారీ సంఖ్యలో భద్రతా బలగాలు నలువైపుల నుంచీ చుట్టుముట్టడంతో మావోయిస్టు దళాలు ఉక్కిరిబిక్కిరయ్యాయి. ప్రభుత్వాల బహుముఖ వ్యూహం చివరకు పైచేయి సాధించింది.



## పోలీసు బెటాలియన్లు వాపస్

'ఆపరేషన్ కగార్'కు కొనసాగింపుగా 'మిషన్-2026' 'ఎండ్ గేమ్' పేరుతో కేంద్ర హోంశాఖ కొత్త వ్యూహానికి శ్రీకారం చుట్టింది. 'మావోయిస్టు ముక్త్ భారత్' లక్ష్యంగా చేపట్టనున్న ఈ వ్యూహంలో భాగంగా ఇక నుంచి కూంబింగ్ ఆపరేషన్లను తగ్గించి సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయనున్నది. దాదాపు ఐదు బెటాలియన్ల సీఏపీఎఫ్ బలగాలు దండకారణ్యం నుంచి వెనక్కి వెళ్లనున్నాయి. నాలుగు కోబ్రా (సీఆర్పీఎఫ్‌కు అనుబంధంగా ఉండేవి) యూనిట్లు సైతం చత్తీస్‌గఢ్ నుంచి జార్ఖండ్‌లోని సరందా ఫారెస్టు (పశ్చిమ సింగ్భం జిల్లా పరిధి)కు తరలనున్నాయి. ప్రస్తుతం చత్తీస్‌గఢ్‌లోనే ఉన్న కొన్ని సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ భద్రతా బలగాలు బస్తర్ పరిధిలోని కొన్ని ఎంపిక చేసిన అటవీ ప్రాంతాలకు ఫోకస్ షిఫ్ట్ చేయనున్నాయి. ఒకప్పుడు పన్నెండు రాష్ట్రాల్లో ఉన్న మావోయిస్టు కార్యకలాపాలు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి.

## ఏప్రిల్ 1 తర్వాత చర్యలకు 'బ్లూ ప్రింట్'

ఇంతకాలం మావోయిస్టుల ఏరివేత కోసం కొనసాగిన చత్తీస్‌గఢ్‌లో పోలీసు క్యాంపులన్నీ ఇక నుంచి సమీకృత అభివృద్ధి కేంద్రాలు (ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సెంటర్స్)గా మారనున్నాయి. అక్కడి ఆదివాసీలకు వైద్య సేవలు, పాఠశాలలు, కనీస మౌలిక సౌకర్యాలు, 4-జీ ఇంటర్నెట్ సర్వీసులు, విద్యుత్ సరఫరా, రోడ్డు సౌకర్యం, నివాస వసతి తదితరాలను అందుబాటులోకి తేవడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించనున్నాయి. లొంగిపోయిన మావోయిస్టులు మళ్లీ ఉద్యమ బాట పట్టకుండా నిఘా వేస్తాయి. స్థానిక ఆదివాసీల అభివృద్ధి సంక్షేమాన్ని పర్యవేక్షించనున్నాయి. పోలీసు క్యాంపులను ఎత్తివేస్తున్నా మావోయిస్టుల డంపుల ఏరివేత, అందులోని ఆయుధాలు, సాహిత్యం, ఇతర వస్తువుల స్వాధీనం, రోడ్ల పక్కన, కింద పాతిపెట్టిన మందుపాతరలు, పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే ప్రోగ్రామ్‌పై కొంతకాలం దృష్టి సారించనున్నాయి.

## అదృశ్యమైన పీఎల్జీఏ సైనిక నిర్మాణం

బలమైన శత్రువుతో పోరాడేందుకు గెరిల్లా యుద్ధ ఎత్తుగడలతో పాటు పీఎల్జీఏ పేరుతో ప్లాటూన్ మొదలు బెటాలియన్ వరకు మావోయిస్టు పార్టీ బలమైన సైనిక నిర్మాణాన్నే ఏర్పాటు చేసుకున్నది. అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకున్నది. గ్రామ స్థాయిలోని మిలీషియా దళాలకు సొంతంగా తయారు చేసుకున్న ఆయుధాలను అందించింది. పోలీసులు ఎన్నడూ వాడని గ్రెనేడ్ లాంచర్లు, ల్యాండ్‌మైన్, క్లేమోర్ మైన్, ప్రెషర్ మైన్, రిమోట్ కనెక్టివిటీ.. ఇలాంటివన్నీ మావోయిస్టు పార్టీ సైనిక ప్రత్యేకతలు. ఇన్ని ఉన్నా పట్టణాలు, మైదానాలను విడిచి అడవికే పరిమితమైంది. చివరకు ఆ పార్టీ ఆత్మరక్షణలో పడింది. వేలాది ఆయుధాలు పోలీసుల వశమయ్యాయి. మిలీషియా దళాలు డీమోరల్ అయ్యాయి. ప్లాటూన్ లాంటి వ్యవస్థలు కనుమరుగయ్యాయి. 'గతం' ఘనమైనా భవిష్యత్తు ప్రశ్నార్థకం.



## గ్రేహౌండ్స్, డీఆర్జీ, 'కోబ్రా' కొనసాగుతాయా?

కేవలం మావోయిస్టుల ఏరివేత కోసమే ఉనికిలోకి వచ్చిన గ్రేహౌండ్స్, యాంటీ నక్సల్ స్క్వాడ్, డీఆర్జీ, కోబ్రా, సీ-60 లాంటి ప్రత్యేక సాయుధ పోలీసు విభాగాలు ఇకపైనా కొనసాగుతాయా?.. ఇప్పుడున్న సంఖ్యతో పోలిస్తే పరిమితమవుతాయా?.. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో ఇకపైన కూడా నిఘా కొనసాగుతుందా?.. ఇలాంటి అనేక సందేహాలు నెలకొన్నాయి. ఆపరేషన్ కగార్ ముగింపు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటన, తదుపరి వ్యూహంతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే సూచనలు వీటి ఫ్యూచర్ యాక్షన్‌ను నిర్ణయించనున్నాయి. మావోయిస్టు పార్టీ అంతమైనా ఆ భావజాలం కనుమరుగు కావడానికి చాలా సమయం పడుతుందని పోలీస్ అధికారుల్లోనే ఒక అభిప్రాయం నెలకొన్నది. ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నవారు, 'మిస్సింగ్'గా మిగిలిపోయినవారు రహస్యంగా కొనసాగించే కార్యకలాపాలు, ప్రజలపై పడే ప్రభావం.. వీటిపై ఇంటెలిజెన్స్ నిఘా కొనసాగే అవకాశాలు లేకపోలేదు.